

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 138 ఎడిటర్ : జి.రాజేష్ గురువారం 13 ఆగష్టు 2026 పేజీలు : 6 వెల రూ. 4.00



## బీచ్‌శాండ్ మినరల్స్‌కు మరింత ప్రాధాన్యం

- ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ
- అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీతో సీఎం చంద్రబాబు

2లో

# నేరాల రూపం మారింది పోలీసింగ్ మారాలి



- క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం
- ఏపీ పోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి
- రాష్ట్రంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం
- ఇక ప్రతీ నెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు
- పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలతోనే ఇబ్బందులు
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠినంగా ఉండండి
- సీఎం చంద్రబాబు

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం సమావేశం నిర్వహించారు. డీజీపీ సహా రేంజ్ ఐజీలు, డీఐజీలు, డీఎస్పీలు,
స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఏపీ పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు.
నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు.

మిగతా 2లో



## ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ-మద్రాస్‌తో ఎం.ఓ.యు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం
- రక్షణ గోడ డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ మద్రాస్
- నవంబర్ నుంచి పనులకు శ్రీకారం
- రూ.323 కోట్లతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం

అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బ తింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పండింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ - మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్.డి.ఎమ్.ఎఫ్)

మిగతా 2లో




## ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

- సంఖ్యా బలం ఉంటేనే వస్తుంది
- అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలే అనర్హతను పరిశీలిస్తున్నాం
- అసెంబ్లీ ఆవరణలో 14,15 తేదీల్లో స్వాతంత్య్ర ఉత్సవాలు
- ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

2లో

## పుష్కర ఎత్తిపోతల పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై మంత్రి నిమ్మల ఆగ్రహం



-షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు

-మంత్రి నిమ్మల రామానాయుడు

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

- ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ

2లో



## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు



- గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులు
- రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న డిఫెన్స్ ప్రాజెక్టులు జాతికి గర్వకారణం
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ లాంటి రంగాలపై దృష్టి
- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదం
- వివిధ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాల కల్పన
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

మిగతా 2లో



## రోడ్డున పడి విమర్శలు చేయడం కాదు

- దమ్ముంటే అసెంబ్లీకి రండి
- డిఎస్పీపై అనుమానాలుంటే చర్చించండి
- ఐదేళ్లలో డిఎస్సీ నిర్వహించలేని వారు విమర్శలా
- నిరాధార ఆరోపణలతో ఆందోళన చేయడం సరికాదు
- వైఎస్ జగన్‌కు హోంమంత్రి అనిత సవాల్

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

### ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి

### అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

హైదరాబాద్,ఐఎన్‌బిటైమ్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు



ముందు ఆయా తెలంగాణ

మిగతా 2లో

# ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ మద్రాస్‌తో ఎం.ఒ.యు

ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్.డి.ఎమ్.ఏ.) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది.ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం:**

ఐఐటీ మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా. ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర ఎత్తిపోతల పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై మంత్రి నిమ్మల ఆగ్రహం

అమరావతి, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఈఈలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

## వైసిపి హయాంలో గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు

హైకోర్టుకు సిట్ సమర్పించిందని.. దీనిపై వైసీపీని నిలదీయాల్సిందే అని మంత్రులకు సూచించారు. అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఘోర తప్పిదాలు జరిగాయని సీఎం అన్నారు. మంత్రులు అందరూ సిట్ రిపోర్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వైసీపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. వాటిపై అసెంబ్లీలో కూడా చర్చిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీలో ఎటువంటి తప్పులూ చేయలేదని, అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. డీఎస్సీపై వైసీపీ శాసనమండలిలో లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని, ఆధారాలతో సహా నిరూపిద్దామని మంత్రులకు సూచించారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రాని, అర్హత లేని ప్రతిపక్ష హోదాను ఎవరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా.. 23 మంది ఉంటే నలుగురిని లాగేస్తే ప్రతిపక్షహోదా టీడీపీకి పోతుందని జగన్ చెప్పారని, ఇప్పుడు ఆ మాటలను మరిచిపోయారని మంత్రులు తెలిపారు. సోషల్ మీడియాలో ఆనాటి జగన్ మాటలు నేటికీ చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై శాసనమండలిలో దుమ్ముదులుపుతామని మంత్రులు అన్నారు. ఈ సందర్భంగా సిట్ నివేదికను తెలుగులోకి అనువదించి మరీ మంత్రులకు సీఎంవో అధికారులు వివరించారు.

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ



జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని
లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

అమరావతి,ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సీఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు.
కొందరు పనిగట్టుకుని కాలుష్యకార కాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

# బీచ్‌శాండ్ మినరల్స్‌కు మరింత ప్రాధాన్యం

అమరావతి,ఆగస్ట్12

బీచ్‌శాండ్ మినరల్స్‌కు మరింత ప్రాధాన్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి ఉపకరించేలా రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని బృందంతో సీఎం చంద్రబాబు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం కి ప్రాధాన్యమివ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో రూ.16 వేల కోట్ల పెట్టుబడితో అదానీ గ్రూప్ టైటానియం ఎ÷-లాంట్‌ను ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. బీచ్ శాండ్ మైనింగ్ ద్వారా ఏయే ఉత్పత్తులు వస్తాయో.. వాటిని ఏయే రంగాల్లో వినియోగిస్తారని సీఎం చంద్రబాబు ఆదానీ సంస్థ ప్రతినిధులను అడిగారు. వాటికి ఉన్న డిమాండ్ ఆధారంగా ఆయా అంశాల గురించి అదానీ ప్రతినిధుల బృందం సీఎంకు వివరించింది.

# ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

అమరావతి,ఆగస్ట్12: ప్రతిపక్షం అనేది ఒక హోదా..., అది సరిపడా సంఖ్యాబలం ఉంటేనే దక్కుతుందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. అది కోరుకుంటే వచ్చేది కాదని అన్నారు. పరోక్షంగా వైసిపి డిమాండ్‌పై స్పీకర్ స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు. పోలీసు బ్యాండ్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలను.. ఆ రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాకపోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడదని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకురావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు? కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం.

# నేరాల రూపం మారింది... పోలీసింగ్ మారాలి

(మొదటి పేజి (తరువాయి)

దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటు పాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఓ ప్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాలి.

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం:**

2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డీఎన్ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసు అధికారులు సమర్ధంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిర్లక్ష్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు:**


శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిర్లక్ష్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టు గా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు.

# రోడ్డున పడి విమర్శలు చేయడం కాదు

అమరావతి,ఆగస్ట్12:మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్ ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఏపీ హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. అసెంబ్లీలో అన్ని అంశాలను చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 'అధ్యక్షా' అనే అవకాశం కూడా వైకాపా ఎమ్మెల్యేలకు జగన్ ఇవ్వట్లేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్.. ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా బయట ఆరోపణలు చేయడమేంటని వైసీపీని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో.. నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలని అన్నారు.

రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు. జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారి దగ్గర ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలి. ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మెగా డీఎస్సీని పూర్తి చేయలేకపోయిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ



న్యూఢిల్లీ,ఆగస్ట్12 భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి.

# మాచర్లలో రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థల పరిశీలన

ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల, ప్రతినిధి ఆగస్టు 12: మాచర్ల పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా, గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు వీలుగా రైతు బజార్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రతిపాదిత స్థలాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. మాచర్ల పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలానికి జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థల విస్తీర్ణం, రైతు బజార్ ఏర్పాటుకు అనుకూలత, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం, రహదారి సౌకర్యం, వాహనాల రాకపోకలు, అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితర అధికారులు ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. రైతు బజార్ ఏర్పాటుతో మాచర్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు తమ పంటలను నేరుగా విక్రయించుకునే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు.రైతు బజార్ అందుబాటులోకి వస్తే రైతులకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు, వినియోగదారులకు కూడా తాజా కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతు బజార్ ఏర్పాటుకు అవసరమైన స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, మార్కెట్ నిర్వహణకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు.




ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అనంతరం రైతు బజార్ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి చర్యలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ చర్చించారు. రైతులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా రైతు బజార్ ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## GWMC పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి: బల్దియా కమిషనర్



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగస్టు 12:

గ్రేటర్ వరంగల్ పరిధిలో పన్ను వసూళ్లకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి బకాయిలను సమర్థవంతంగా వసూలు చేయాలని బల్దియా కమీషనర్ తేజావత్ వెంకన్న అధికారులను ఆదేశించారు.కొత్త భవనాల్లో ఆన్-అసెస్ మెంట్లు, అండర్-అసెస్ మెంట్లు గుర్తించి సక్రమంగా పన్నులు విధించాలని సూచించారు. కాశిబుగ్గ, కాజీపేటలో 1,828 కొత్త అసెస్మెంట్లు గుర్తించగా, 464 వసూలైనట్లు తెలిపారు.

## ఇజ్రాయేల్ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం:నచీఖ కలెక్టర్



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగస్టు 12:

ఇజ్రాయేల్ పర్యటనలో పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ,మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం విధానాలను అధ్యయనం చేసినట్లు హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. సముద్రపు నీటి శుద్ధి, శుద్ధి చేసిన మురుగు నీటి పునర్వినియోగం జిఐఎస్ ఆధారిత మౌలిక వసతుల నిర్వహణ వంటి విధానాలు స్ఫూర్తిదాయక మని అన్నారు. ఈ అనుభవాలు వరంగల్ పట్టణ నీటి సరఫరా, వినియోగం, చెరువుల పునరుద్ధరణకు ఉపయోగపడతాయని తెలిపారు.

## ఇంటి ముందు నిద్రిస్తున్న వ్యక్తిపై గొడ్డలితో దాడి.. దారుణ హత్య

### దుర్గి మండలం ఓబులేసునిపల్లెలో ఘటన




ఐ ఎన్ బి టైమ్స్ దుర్గి ఆగస్టు 12: పల్నాడు జిల్లాలో దారుణ హత్య చోటుచేసుకుంది. దుర్గి మండలం ఓబులేసునిపల్లెలో ఇంటి బయట నిద్రిస్తున్న కొమ్ము ఇమ్మానుయేలు (35)పై గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇమ్మానుయేలు ఇంటి ముందు నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న గురజాల డీఎస్పీ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు తదితర కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈ దారుణ ఘటనతో ఓబులేసునిపల్లెలో తీవ్ర ఆందోళన నెలకొంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## వాటర్ ట్యాంకులను శుభ్రపరచండి మహాప్రభో.



ఐ ఎన్ బి టైమ్స్ రంగారెడ్డి ఆగస్టు 12: రంగారెడ్డి జిల్లా లోని శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని 106 డివిజన్ రాజీవ్ గృహకల్పలోని మంచినీటి వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. మంచినీరు సరఫరా అయ్యే సమయంలో నాచూ వస్తుందని ఇలాంటి సమయాలలో అంతు చిక్కని రోగాలు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు ముక్కు మీద వేలేసుకుంటున్నారు. వాటర్ కమిటీ నిర్వాహకులు వెంటనే స్పందించి ట్యాంకును శుభ్రం చేయాలని కోరుతున్నారు

## 120 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ







ఐ ఎన్ బి టైమ్స్ దాచేపల్లి ప్రతినిధి ఆగస్టు 12

దాచేపల్లి నగర పంచాయతీ నందు మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ దాచేపల్లి వారి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులచే దాచేపల్లి మండల కూటమి నాయకులతో కలిసి తిరంగా ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగింది.ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో జెండా ఆవిష్కరణ చేసి తరువాత ప్రభుత్వం వారిచే పంపించబడిన స్పోర్ట్స్ డ్రస్సు మరియు బూట్లు ను పిల్లలకు పంచడం జరిగింది ఆ తరువాత 120 మీటర్ల జాతీయ జెండాతో స్కూల్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరీ జడ్పీ స్కూల్ పిల్లలతో కలిసి బంగ్లా సెంటర్ వద్దకు వచ్చి తిరిగి స్కూలు వరకు ర్యాలీ కొనసాగింది.ఈ ర్యాలీలో దాచేపల్లి మండల ఎమ్మార్వో శ్రీనివాస్ యాదవ్ సీఐ ఖాజావలి ఎంఈఓ పినాకపాణి మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు తో పాటు ఉపాధ్యాయులు దాచేపల్లి జెడ్ పి హెచ్ పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు మండల కుటమి నాయకులతో కలిసి భారతీయ జనతా పార్టీ దాచేపల్లి మండల అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు పాల్గొన్నారు

## విజయ పాల ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం

విజయవాడ సెంట్రల్,విజయ పాల ధరలను లీటరుకు రెండు రూపాయల చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం లెనిన్ సెంటర్‌లోని విజయ డెయిరీ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హెరిటేజ్ మరియు ఇతర ప్రైవేటు డెయిరీల ప్రయోజనాల కోసం విజయ డెయిరీని బలితీసుకుంటోందని విమర్శించారు. ప్రజలపై వంద కోట్ల భారం గత ఏప్రిల్‌లో లీటరుకు రెండు రూపాయలు పెంచిన డెయిరీ నాలుగు నెలలు గడవక ముందే మళ్లీ ఆగస్టు 10 నుండి మరో రెండు రూపాయలు పెంచడం గర్హనీయమని బాబురావు మండిపడ్డారు.రూ.100 కోట్ల భారం సామాన్యులపై పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలో వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని తక్షణమే అమలు చేయాలి డిమాండ్

### బ్యాంకు ఉద్యోగులు నిరసన




ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల ఆగస్టు 12:యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ ఆందోళనలో భాగంగా ఉద్యోగులు కంచికచర్ల సెంట్రల్ బ్యాంక్ ముందు ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం నెలలో రెండో, నాలుగో శనివారాలు బ్యాంకులకు సెలవులు ఉండగా, మిగిలిన శనివారాల్లో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించి, సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే బ్యాంకింగ్ సేవలు నిర్వహించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.ఐదు రోజుల పనిదినాల ప్రతిపాదనపై ఇప్పటికే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఏ) సిఫారసు చేసినప్పటికీ, అమలుపై నిర్ణయం ఆలస్యం అవుతోందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు బ్యాంకింగ్ రంగంలో పని వ్యక్తిగత జీవన సమతుల్యత మెరుగుపడేందుకు ఐదు రోజుల పనిదినాల విధానం అవసరమని పలువురు బ్యాంకు ఉద్యోగులు పేర్కొన్నారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇందుకోసం భవిష్యత్తులో తమ పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు కిరణ్ కుమార్ రెడ్డి, నరేంద్ర, ప్రకాష్ గుప్తా, నిఖిల్ పవన్, అనురాధ, శేఖర్, మానస, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు





ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ ఆగస్టు 12 :గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విలేజ్ వెల్నెస్ హెల్త్ సెంటర్ భవనాన్ని బుధవారం కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. గతంలో చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఆ ఇబ్బందులను తొలగించి వైద్య సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని తెలిపారు.వెల్నెస్ హెల్త్ సెంటర్ల ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు నిరంతరం ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ప్రజారోగ్యమే ప్రాధాన్యతగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమంతో పాటు ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సౌమ్య అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.రాఘవాపురం గ్రామ ప్రజలకు నూతన హెల్త్ సెంటర్ అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సౌమ్య కోరారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తనువు పులకరింపజేసి భక్తిని ప్రసాదించే బల్కంపేట రేణుక ఎల్లమ్మ..

## 700 సంవత్సరాల చరిత్ర కలిగిన మహా మాన్విత దేవాలయం..



ఐ ఎన్ బి టైమ్స్ రంగారెడ్డి ఆగస్టు 12.బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని బల్కంపేట ప్రాంతంలో ఉన్న ఎల్లమ్మ దేవాలయం. ఏడు వందల సంవత్సరాల క్రితం స్వయంభూమూర్తిగా వెలిసిన ఎల్లమ్మ, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంగా భక్తుల పూజలు అందుకుంటుంది.

దాదాపు 700 ఏళ్లక్రితం హైదరాబాదు నగరం ఏర్పడకముందు బల్కంపేట చుట్టూ పొలాలతో ఒక చిన్న గ్రామంగా ఉండేది. ఒక రైతు తన పొలంలో బావిని తవ్వుతూ ఉండగా అమ్మవారి ఆకృతితో ఉన్న బండరాయి అడ్డొచ్చింది. భక్తితో ఆ విగ్రహాన్ని ఒడ్డుకు చేర్చాలని ప్రయత్నించినా, కదలకపోవడంతో వూళ్లోకెళ్లి జనాన్ని తీసుకొచ్చాడు. తలో చేయీ వేసినా కదలలేదు. 'ఇక్కడి నుంచే పూజలు అందుకోవాలన్నది అమ్మవారి అభీష్టం కావచ్చు. దైవనిర్ణయాన్ని కాదనడానికి మనం ఎవరం?' అని శివసత్తులు ఇచ్చిన సలహాతో, మూలవిరాట్టు బావి లోపలనే ఉంచి ఒడ్డున నిలబడే పూజలు చేసేవారు.కొంతకాలానికే, రేణుకా ఎల్లమ్మ మహిమలు చుట్టుపక్కల ప్రాంతాలకూ విస్తరించడంతో, ఓ చిన్న ఆలయం వెలసింది. రాజా శివరాజ్ బహద్దూర్ అనే సంస్థానాధీశుడి హయాంలో 'బెహలూఖాన్ గూడా' గా పిలువబడిన ఈ ప్రాంతం, తరువాతికాలంలో బల్కంపేటగా మారిపోయింది. ఎల్లమ్మతల్లి 'బల్కంపేట ఎల్లమ్మ'గా సుప్రసిద్ధురాలైంది. 1919లో దేవాలయ నిర్మాణం జరిగింది.

### ప్రత్యేక

అమ్మవారి స్వయంభూమూర్తి శిరసుభాగం వెనుక నుంచీ నిత్యం జలధార ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పవిత్ర జలాన్నే భక్తజనం మహాతీర్థంగా స్వీకరిస్తారు. ఆ నీటితో ఇళ్లను శుద్ధిచేసుకుంటే భూతప్రేతపిశాచాది దుష్టశక్తులు పారిపోతాయని ఓ నమ్మకం. స్నానమాడే నీటిలో కాస్తంత తీర్థం కలుపుకుంటే గజ్జి, తామర మొదలైన చర్మరుగ్మతలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు.

### ఉత్సవాలు.

ఏటా ఆషాఢ మాసం మొదటి మంగళవారం ఎల్లమ్మతల్లి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడురోజుల పాటూ జరిగే ఉత్సవాల్ని చూడ్డానికి ముల్లోకాల నుంచీ దేవతలు దిగొస్తారని ప్రతీతి. దాదాపు ఐదు లక్షలమంది జనం హాజరవుతారు. అంతేకాకుండా ప్రతి ఆది, మంగళ, గురువారాలు అమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజులు కనుక ఆ మూడు రోజుల్లో వేలసంఖ్యలో భక్తుల వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి.

**. కేంద్రమంత్రిని కోరిన మంత్రి పొంగులేటి....**

ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 12 రంగారెడ్డి:ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.
బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఏడాది క్రితమే సర్వే పూర్తి.. మంజూరులోనే జాప్యం.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్-2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు.




### ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

పీఎంఏవై -జి కింద ఇచ్చే కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు.

# మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ..

## రేపే పథకం ప్రారంభం..



ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్ట్ 12 రంగారెడ్డి: తెలంగాణలో బీసీ మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది.బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం. ప్రతి నియోజకవర్గానికి 1,000 చొప్పున అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, వయోపరిమితి, ఆదాయ పరిమితి, దరఖాస్తు విధానం తదితర వివరాలను ప్రభుత్వం త్వరలో వెల్లడించనుంది. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది.

# ఇందిరమ్మ ఎల్ ఐ జి టవర్స్ కు శంకుస్థాపన..

- **పటిష్ట భద్రతలి - 300 మంది పోలీసులతో బందోబస్తు..**
- **సభా ప్రాంగణాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ**




ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 12 రంగారెడ్డి: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఎల్‌ఐజి టవర్స్ కు శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, బుధవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. బాంబ్ డిస్పోజల్ బృందంతో ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు.
ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సభా ప్రాంగణంతో పాటు ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున జనసమ్మర్థాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని మోహరిస్తామని చెప్పారు.

### ట్రాఫిక్‌కు ప్రత్యేక ప్రణాళిక..


ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రద్దీ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మార్గాలను ముందుగానే పరిశీలించి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.అనుమానాస్పద వస్తువులు, ఇతర భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు.పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని సీపీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. సభకు వచ్చే ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.
ఈ బద్ధత ఏర్పాటలో పోలీసులు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మిస్సింగ్ మేఘన..పిల్లపిల్ల పిల్ల సాంగ్ రిలీజ్




టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాత్మక చిత్రాలతో పాటు సరికొత్త కథాంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తోన్న తాజా థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపి మూవీస్ మరియు కేడి / కో సంయుక్త బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తోన్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ కార్తీక్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు మరింత జోరందుకున్నాయి. సినిమాలోని ఫస్ట్ సింగిల్ అయిన 'పిల్ల పిల్ల పిల్ల' లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను టాలీవుడ్ ప్రముఖ లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రారంభించారు. రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ వేడుకకు నైపుణ్యం కలిగిన సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు మరియు నిర్మాత బెక్కం వేణుగోపాల్ హాజరయ్యారు. సురేష్ బాబు తన గో÷-డలెన్ హ్యాండ్‌తో పాటను విడుదల చేసి చిత్ర బృందానికి ఘన విజయం సాధించాలని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, సురేష్ ప్రొడక్షన్స్ కి ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న ప్రత్యేక స్థానం గురించి కొనియాడారు. తమ సినిమా ఫస్ట్ సాంగ్ సురేష్ బాబు గారి చేతుల మీదుగా లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని, నన్ను నమ్మి అవకాశం కల్పించిన నిర్మాత నరేష్ బాబుకు, కో-ప్రొడ్యూసర్ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో అద్భుతమైన పాటలు అందించిన సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌కు మరియు ఈ పాటకు ప్రాణం పోసిన ప్రముఖ గాయకుడు జావేద్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాత నరేష్ బాబు మాట్లాడుతూ, తమ సినిమా ప్రారంభోత్సవం కూడా రామానాయుడు స్టూడియోలోనే జరిగిందని, ఇప్పుడు అదే స్టూడియోలో లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు చేతుల మీదుగా మొదటి పాట విడుదల కావడం సెంటిమెంట్‌గా చాలా సంతోషాన్నిస్తోందన్నారు.

# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా




నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.